ప్రజాశక్తి
బుధవారం 25 జనవరి 2023 5
శ్రీ సత్యసాయి

హత్యకేసులో ఆరుగురికి యావజ్జీవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓ హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా కోర్టు జడ్జి జి.శ్రీనివాస్ మంగళవారం నాడు తీర్పును వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండల పరిధిలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన చెన్నారెడ్డి 2017వ సంవత్సరం డిసెంబర్ 17వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. కేసుకు సంబంధించి గంగాధర్, సూర్యనారాయణ, పెద్దన్న, శివయ్య, నాగరాజు, ప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతపురం సెషన్స్ కోర్టు నిందితులు హత్యలో పాలుపంచుకున్నట్లు నిర్ధారిస్తూ వారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. కాగ తీర్పు వెలువడగానే నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వారిని సబ్‌జైలుకు తరలిస్తున్న సమయంలో కన్నీటి పర్యవంతం అయ్యారు.

సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తూ, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజలకు చేరువగా సచివాలయాలు

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-నల్లచెరువు

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలను అందించి ప్రజలకు వాటిని మరింత చేరువు చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం నాడు మండల పరిధిలోని ఎం.అగ్రహారం, ఓరువాయి, తలమర్లవాండ్ల పల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేయడంతో పాటు ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో వివిధ సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన అర్హులైన జాబితా, అనర్హులైన లబ్ధి పొందిన జాబితాను ఖచ్చితంగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రతి వాలంటీర్ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయా గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎం.అగ్రహారం గ్రామంలో సచివాలయం తనిఖీ అనంతరం కలెక్టర్ ద్విచక్ర వాహనంలో వెళ్లి మద్దిమడుగు వెంకటరమణ అనే రైతు టమోటా పంటను పరిశీలించారు, ఈ పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల బీమా పరిహారంలో ఎలాంటి పొరపాట్లు ఉండకుండా వాటిని సరిచేయాలని సూచించారు. ఖరీఫ్ కాలంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఉచిత సేవలను రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత మీ పైన ఉన్నదని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఎంపీడీవో శకుంతల, వ్యవసాయ అధికారి భారతి, అగ్రికల్చర్ ఏడీ సత్యనారాయణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలబాలికలు సమానం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : లింగ వివక్ష చూపకుండా బాలబాలికలను సమానంగా పెంచాలని కలెక్టర్ బసంత్ కుమార్ తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ విద్యా, వైద్య ఆరోగ్య మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల బాలికలకు ఇద్దరికీ సమాన హక్కులు కల్పించాలన్నారు. ఒకరిని ఎక్కువ ఇంకొకరిని తక్కువగా చూడరాదన్నారు. ప్రజలలో అవగాహన కల్పించి ఆడపిల్లలను రక్షించుకోవాలన్నారు. లింగ వివక్షతను, గర్భస్థలింగ నిర్ధారణను వ్యతిరేకించాలన్నారు. బాలికలు ఎందులోనూ తీసిపోరనారు. వారి ఉన్నత విద్యకు తల్లిదండ్రులు అవకాశం కల్పించాలన్నారు. వారం రోజులపాటు నిర్వహించిన బాలికల దినోత్సవం సందర్భంగా వకత్యపు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన 9 మందికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, జిల్లా వైద్యాధికారి ఎస్‌వి.కష్టారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకుమారి, డిఐఒ డాక్టర్ కష్ణయ్య, డిపిఎం కుళ్లాయప్ప, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

- రేపటి నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం
- ఆందోళనలో ఫ్లెక్సీల తయారీ దారులు
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న తయారీదారులు

జీవనంపై నిషేధం..!

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరీరక్షణలో భాగంగా గురువారం నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంను అమలు చేయనుంది. ఇందుకోసం గతేడాది జీవో నెంబర్ 65, 75లను తీసుకొచ్చారు. జీవోకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 26వ తేదీ నుంచి కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఎక్కడా ప్లాస్టిక్ బ్యానర్లను తయారు చేసేందుకు వీల్లేదని అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా నిర్ణయం తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఫ్లెక్సీలు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల తయారీదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ప్రత్యామ్నాయం దొరికే వరకు సమయం పొడగించాలని కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం రేపటి నుంచి ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేదించాలని నిర్ణయం తీసుకుంది.

ప్రజాశక్తి-హిందూపురం

గత రెండు దశాబ్దాల నుంచి డిజిటల్ బ్యానర్ల వాడకం విరివిగా పెరిగింది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని చోట్లా వీటినే వాడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ అందంగా ఉండడం వల్ల ఫ్లెక్సీలకు అనతికాలంలోనే డిమాండ్ పెరిగింది. ప్రధాన నాయకులు వస్తే ఈ ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఆ ప్రాంతంలో దగద గలాడు తుంటాయి. వినియోగం పెరగడంతో చాలా మంది ఈ రంగంలోకి వెళ్లి అందులో స్థిరపడ్డారు. పట్టణాల్లో ఫ్లెక్సీల తయారీ, ప్రింటింగ్ ఒక పెద్ద ఉపాధి రంగంగా మారింది. చాలా మంది బ్యాంకుల్లో ఋణాలను తీసుకుని ప్లాస్టిక్ బ్యానర్‌ల తయారీ యంత్రాలను పెట్టుకుని ఉపాది పొందుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 100 పైగా ఫ్లెక్సీ సెంటర్‌లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుతం ప్లాస్టిక్ బ్యానర్ల తయారీ నిషేధంతో వీరంతా ఉపాధికి దూరం అయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఉపాధిపై దెబ్బ

ఫ్లెక్సీ సెంటర్లలో ఒక్కో దాంట్లో 10మంది దాకా వర్కర్లు ఆధారపడి జీవిస్తున్నారు. యజమానులు ఒక్కొక్కరు రూ.10లక్షలు అంతకంటే ఎక్కువ ఖర్చు చేసి యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వచ్చే ఆదాయంలో కంతులకు కట్టుకుని, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలనూ పోషించుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఫ్లెక్సీ ప్రింటింగ్‌లను ఆపే యాలని నిర్ణయం తీసుకోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం చూపించే వరకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

కాటన్ బట్టలతో తయారు చేయాలి

మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ తయారీదారులు అందరు ప్లాస్టిక్‌తో కాకుండా కాటన్ బట్టలతో బ్యానర్‌లను తయారు చేయాలి. ఇప్పటికే ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఉత్వర్వులు ఇచ్చింది. తయారీ దారుల కోరిక మేరకు గడువు పెంచారు. ఈ గడువూ ముగిసిన నేపథ్యంలో ఈనెల 26 నుంచి నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం. దీనిని ఉల్లగించిన వారికి ఒక అడుగుకు రూ.100 చొప్పున జరిమాన విధించడంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రత్నామ్యాయం కల్పించాలి

ఎం.ఇంతియాజ్ సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్లెక్సీల నిషేధంపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ రంగంపై ఆధారపడి చాలా మంది నిరుద్యోగులు జీవనం సాగిస్తున్నారు. అధికారులు ప్రభుత్వం ఈ రంగం కార్మికులతో మాట్లాడాలి. వీరికి ప్రత్యామ్నాయం దొరికే వరకు ప్లాస్టిక్ నిషేధాన్ని వాయిదా వేయాలి. ఎటువంటి ప్రత్యామ్నాయ అవకాశాలు చూపకుండా నిషేధం తీసుకువస్తే ఆ రంగంపై ఆధారపడిన ఉత్పత్తిదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో క్లాత్ బ్యానర్లు ప్రింట్ వేసుకోవడానికి వీలుగా మిషనరీని అప్‌డేట్ చేసుకోడడానికి, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవడానికి సంవత్సరం గడువు ఇవ్వాలి. అలా కాకుండా ఒక్కసారిగా నిషేధం నిర్ణయం తీసుకుంటే దానిపై ఆధారపడిన పేద కుటుంబాలన్నీ ఇబ్బందుకలు గురవుతాయి.

పరిటాల ఆశయ సాధనకు కృషి : శ్రీరామ్

పరిటాల ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న సినీ హీరో నందమూరి తారకరత్న తదితరులు

కనగానపల్లి : పరిటాల రవీంద్ర మరణించి 18ఏళ్లు గడిచినా అభిమానం చెక్కుచెదరలేదని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్ర వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం రామగిరి మండలం, వెంకటాపురం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పరిటాల ఘాట్ వద్ద పరిటాల శ్రీరామ్ తో పాటు ఇతర కుటుంబసభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన అభిమానులు ఘాట్ వద్ద నివాళు లర్పించారు. ఉదయం 8 గంటల నుంచే జనం తాకిడి కనిపించింది. నందమూరి కుటుంబం నుంచి సినీ నటుడు తారకరత్నతో పాటు, శ్రీ సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బికె పార్థసారథి, హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పూల నాగరాజు, సవితమ్మ ఇంకా పలువురు ప్రముఖులు తరలివచ్చారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని ఈసందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. కేవలం అనంతపురం జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా అభిమానులు అధికసంఖ్యలో వచ్చారు. అభిమానులు భారీగా తరలిరావడంతో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవీంద్ర ఆశయ సాధన కోసం తనతో పాటు తమ కుటుంబసభ్యులంతా పని చేస్తున్నామన్నారు. ఆయనపై ఇంత అభిమానం చూపుతున్న వారందరికీ పేరు పేరునా కతజ్ఞతలు తెలిపారు

నందమూరి, పరిటాల కుటుంబాలు వేర్వేరు కాదు

పరిటాల కుటుంబం, నందమూరి కుటుంబం వేర్వేరు కాదని సినీ నటుడు నందమూరి తారకరత్న అన్నారు. పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా ఆయన వెంకటాపురం వచ్చారు. శ్రీరామ్ తో కలసి ఘాట్ వద్ద ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం రవి కుటుంబసభ్యులతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా తారకరత్న మాట్లాడుతూ పరిటాల రవీంద్ర తనకు సోదర సమానుడన్నారు. పరిటాల కుటుంబానికి నందమూరి కుటుంబం అండగా ఉంటుందని తారకరత్న అన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

కదిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కదిరి టౌన్ : బాలికలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని కదిరి మండల విద్యాశాఖ అధికారి చెన్నకృష్ణ సూచించారు. కదిరి ప్రజా సేవా సమాజ్ సంస్థకు చెందిన చైల్డ్ లైన్ 1098 అధికారులు కదిరి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సేవా సమాజ్ చైల్డ్ లైన్ డివిజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ వివక్షత లేని సమాజాన్ని నిర్మించి, బాలికలు అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశాలు కల్పించడానికి కుటుంబ స్థాయిలో, సమాజ స్థాయిలో, పాఠశాల స్థాయిలో విస్తతంగా అవగాహనలు కల్పించడమే ఈ బాలిక దినోత్సవం ఉద్దేశం అన్నారు. బాలబాలికలను ఆపదల నుండి రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం చైల్డ్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబరును తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషలాఫీసర్ శ్రీలక్ష్మి, ప్రజా సేవా సమాజ్ చైల్డ్ లైన్ 1098 అధికారులు లక్ష్మీ ప్రసన్న, మౌనిక, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శేషాచలం మాట్లాడుతూ బాలికల భద్రత, విద్య,ఉద్యోగాల్లో వారికి సమాన అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రెడ్డి రమణమ్మ, ఎఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్లమీదపల్లి లోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం ఘనంగా బాలికల దినోత్సవం నిర్వహించిచారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, అంగన్వాడీలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో మెరిసిన హర్షిత

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వివేకానంద మిలినీయం పాఠశాలకు చెందిన హర్షిత చిత్రలేఖనం పోటీల్లో మెరిసింది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతు పరీక్ష పే చర్చలో భాగంగా అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో మానవ వనరుల మంత్రిత్వ శాఖ, సిబిఎస్ఇ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో అనంతపురం, సత్యసాయి సంయుక్త జిల్లాల చిత్రలేఖన పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో రెండు జిల్లాలకు చెందిన 23 సిబిఎస్ఇ పాఠశాలలు పాల్గొన్నాయన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన ఎం హర్షితకు మొదటి బహుమతి దక్కిందన్నారు. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆటోగ్రాఫ్ పుస్తకాన్ని అందుకుందన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి కదిరి టౌన్

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కదిరి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మండల అధ్యక్షులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులు మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. రూ.20 వేలకు పైగా డిపాజిట్ చేసిన 7 లక్షల కుటుంబాలు ఆర్థిక, మానసిక సంక్షోభంతో జీవనం కొనసాగిస్తున్నాయని వాపోయారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

రక్తదానం చేయడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

తలసేమియా బాధితులను ఆదుకోవడం కోసం రక్తదానం చేయడానికి ముందుకు రావాడం అభినందనీయమని సినియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్తదానసంఘం, హెల్పింగ్ హార్ట్స్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువకులు మందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందనికి న్యాయమూర్తి, ఎపిపి ఇందాద్, ఎంఇఒ గంగప్పల చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఫారూక్ ఖాన్, రాజకుమారి, ఆర్ఎంఒ డాక్టర్ రుక్మిణమ్మ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అయిషా, ఉబెదుల్లా హుసేన్, బిలాల్ అమీన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రవి, నవీన్, వేణుగోపాల్, వృక్షరక్షకుడు భాస్కర్ రెడ్డి, అల్ ఇందాద్. సెల్ పాయింట్ నురూల్లా తదితరులు పాల్గొన్నారు.

ఒటిఎస్ పేరుతో మోసం

ప్రజాశక్తి-హిందూపురం

ఒటిఎస్ పేరుతో ప్రభుత్వం లబ్దిదారులను దారుణంగా మోసం చేసిందని ఒటిఎస్ లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంగళవారం కోట్నురు సచివాయం ముందు అధికారులు ఇచ్చిన ఒటిఎస్ ప్రతులను కాల్చి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం చేపట్టిన ఒటిఎస్ పథకంలో రిజిస్టర్ చేసిన పత్రాలు రికార్డుల్లో చూపడం లేదని, దీంతో తమకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వటం లేదని వాపోయారు. ఆస్తిని ఇతరులకు విక్రయించడానికి వీలులేకుండా పోయిందన్నారు. తమకు న్యాయం చేయాలని, తమ ఇంటి స్థలాలను రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన రెవిన్యూ అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయం ముందు ఒటిఎస్ ప్రతులతో ఆందోళన చేస్తున్న లబ్దిదారులు

ఉత్సవాల కోసం విరాళం

విరాళం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

కదిరి టౌన్ : తలుపుల మండల కేంద్రంలో ఈనెల 25 నుండి 27 వరకు నిర్వహించే హజ్రత్ సయ్యద్ షా బాబాషర్ఫోద్దీన్ ఉరుసు నిర్వహణకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ తనవంతుగా విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన దర్గా కమిటీ సభ్యులకు రూ.15వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు బాహుద్దీన్, దర్గా ప్రెసిడెంట్ అందుమియా, ఆవజన్, చంద్ర, ఇమామ్ సాబ్, గౌస్ , సలీం, జాకీర్, సలీంబాషా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్య

లేపాక్షి : మండలంలోని శిరివరం గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనాన్ని అందించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నీటి సౌకర్యం లేదన్నారు. మధ్యాహ్నం భోజనం వండడానికి, భోజనం తిన్న తర్వాత తాగడానికి ఇతర అవసరాలకు కూడా నీరు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అశ్వర్థ నారాయణ, ఇంతియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సౌకర్యం

రొద్దం : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. ట్రస్టు ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో అన్నదానం ఈ సౌకర్యం కల్పించినట్లు ట్రస్ట్ డైరెక్టర్ క్రిష్టప్ప తెలపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపాల్‌నాయుడు, అక్బర్, చెన్నకేశవులు, ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

బత్తలపల్లి : మండల కేంద్రంలోనిశ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని స్వామి ఆలయ నాలుగవ వార్షికోత్సవం మూడు రోజులుగా కనులపండువగా జరుగుతోంది. ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీకోటి సుధ దంపతుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు వేదపండితులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి స్వాగతం పలుకుతూ ఆలయానికి తీసుకువచ్చారు.

ఆకట్టుకున్న ఎదురుకోళ్లోత్సవం : ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఎదురుకోళ్లోత్సవం ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం వనజ , ఉప సర్పంచి కోటి గోపీ, ఎంపీటీసీ కోటి నరేష్, సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, కమతం వరలక్ష్మి, గుర్రం శ్రీనివాసరెడ్డి, కమతం ఈశ్వరయ్య యోగానందాచారీ తదితరులు పాల్గొన్నారు.

బీడుపల్లిలో పొలంబడి

సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు, రైతులు

పుట్టపర్తి రూరల్: మండలంలోని బీడుపల్లి రైతుభరోసాకేంద్రం పరిధిలో వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.సుబ్బారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పంటసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. పొలంబడి ద్వారా సాగులోని సమస్యలకు అవసరమైన పరిష్కారాలు రైతులకు లభిస్తాయని జిల్లా అగ్రి అడ్వైసరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, అర్బన్ మండల వైసీపీ కన్వీనర్ రంగా రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సనావుల్లా, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డి, పుట్టపర్తి మండల వ్యవసాయాధికారి వెంకటబ్రహ్మం, పుట్టపర్తి రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్ లక్ష్మితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

తపాల బీమాపై అవగాహన

గాండ్లపెంట : మండల కేంద్రంలోని తపాలా బీమాపై ప్రజలకు అవగాహన నిర్వహించినట్లు తపాలా శాఖ ఎస్పిఎం సి. రామ్మోహన్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి కదిరి డివిజన్ తపాల శాఖ ఐపిఒ జిల్లాన్‌బాషా హాజరై బీమా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.కార్యక్రమంలో తపాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

సోమందేపల్లి : మండల కేంద్రంలో శ్రీ మార్కండేయ జయంతిని పద్మశాలి సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ లో మార్కండేయ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడిమెల అశోక్, మలిశెట్టి రంగనాయకులు, అర్అర్ రామాంజి, గనిశెట్టి రమణ, జక్క చంద్ర, నల్లగుండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

రొద్దం : మండలంలోని దొడగట్ట గ్రామంలో మొక్కజొన్న పంట కోత ప్రయోగాలను వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని రైతు వెంకటేష్ పొలంలో నిర్వహించిన మొక్కజొన్న పంట దిగుబడిని అంచానా వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి విజయ్ కుమార్, డివిజన్ స్టాటిస్టిక్స్‌అధికారి మల్లికార్జున. ఎఇఒ అంజాద్, ఎస్ఐఒ రమణతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి సూర్యప్రభ,శేషవాహనాల వితరణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి దాతలు సూర్యప్రభ, శేషవాహనాలను వితరణ చేశారు. పట్టణానికి చెందిన డీఎన్ఎం దుగ్గుమహేశ్వరి, సుందరేష్ దంపతులు, కుమారుడు దుగ్గుశ్రీహరి సూర్యప్రభవాహనాన్ని అందజేశారు. ఆదిమూలంరామిశెట్టి జ్ఞాపకార్థం ఆయన భార్య ఆదిమూలం యశోదమ్మ, కుమారుడు లక్ష్మీచెన్నకేశవ, కోడలు లక్ష్మీ హరిణి, మనవరాళ్లు వల్లభి, పలశతిలు శేషవాహనాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టిసుబ్రమణ్యం, డైరెక్టర్లు అజంతకిష్ట, అశ్వర్థనారాయణ, రంగనాయకులు, పొరాల్ల పద్మావతి, అశ్వర్థ నారాయణ, అన్నమయ్య సేవ మండలి అధ్యకులు పోరాళ్ల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

అమరాపురం : మండలంలో బోరు బావుల కింద రబి సీజన్‌లో సాగు చేసిన పంట వివరాల నమోదు పక్రియను కలెక్టర్ కార్యాలయ సిసి అమర్నాథ్ మంగళవారం పరిశీలించారు. సర్వేనెంబర్ 265/1కు సంబంధించిన పొలంలో అధికారులు చేపట్టిన పంట కోత ప్రయోగం గురించి ఆరా దేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మంజునాథ్, వీఆర్వో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

బాధితుడికి నగదు అందజేత

హిందూపురం : హిందూపురం మండలం విద్యాశాఖ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ కింద విధులు నిర్వహిస్తున్న కొల్లప్ప గుండె పోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబసభ్యులకు హిందూపురం ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ కింద ఎంఇఒ గంగప్ప చేతుల మీదుగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు కొల్లప్ప కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అదే విధంగా పిటిఐల తరపున మరో రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి


ధర్మవరం, పెనుకొండలో వినతిపత్రాలు అందజేస్తున్న నాయకులు, అంగన్వాడీలు

ధర్మవరం టౌన్ : పేస్ యాప్ ను తక్షణమే రద్దుచేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక లక్ష్మీ చెన్నకేశవపురంలో ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిల్షాద్ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, అందుకు తగ్గట్టుగా వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలన్నారు. 2017 నుంచి పెండింగ్ లో ఉన్న టిఎ బిల్లులు చెల్లించాలని, సీనియారిటీ ప్రకారం గౌరవవేతనం ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగిం చాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 1ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, ఆయూబ్‌ఖాన్, ఆంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బావమ్మ, ప్రాజెక్ట్ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తెచ్చిన పేస్ యాప్‌వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని,అందులో యాప్స్ ఓపెన్ కాలేదని, ఫేస్ యాప్ హాజరు వేయడం సాధ్యం కాని పని అన్నారు. కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆన్‌లైన్ వర్క్ చేయలేక అధికారులు పెట్టే ఒత్తిడి తట్టుకోలేక మనస్థాపానికి గురవుతున్నారన్నారు. పలు అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు లేవని,కరెంటు సౌకర్యం కూడా లేదని అన్నారు. 5 సంవత్సరాలు నుండి టిఎ, డిఎ చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో కలసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, మురళి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు జయమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, మంజుల, నాగమణి, షర్మిలభాను, ఉషారాణి, అనంతమ్మ, సుబ్బలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన వేతనాలతో పాటు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నా టిఎ, డిఎ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిడిపిఒ కార్యాలయం ముందు ఆందోళన చేసి, సిడిపిఒకు వినతి పత్రం సమర్పించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి 6న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు శోభారాణి, కోశాధికారి శిరీష, సెక్టార్ లీడర్లు గీతా, వాణి, వరలక్ష్మి రాజమ్మ ధనమ్మ, శివమ్మ, భాగ్యమ్మ, పద్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుంటమరవలో పంట నమోదు పరిశీలన

టమోటా పంటను పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

తనకల్లు : మండలంలోని తనకల్లు-3 రైతు భరోసా కేంద్రం పరిధిలోని కుంటమరవలో మంగళవారం చేపట్టిన ఈపంట నమోదును కలెక్టర్ బసంత్ కుమార్ పరివ్యలించారు. గ్రామానికి చెందిన జి. షాహినా అనే రైతు టమాటో పంట పొలాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి పంటసాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు, ఎడిఎ సత్యనారాయణ, ఎఇఒ నయాజ్, వాలెంటీర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల పరిధిలోని మొలకలవారి పల్లికి చెందిన వెంకట రమణారెడ్డి పొలంలో సాగు చేసిన టమోటా పంట పొలాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పంటసాగుకు అయిన పెట్టుబడి, ప్రస్తుతం ఉన్న ధర తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతు తన సమస్యను వివరించారు. మూడు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో పంటసాగు చేసినట్లు చెప్పారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవటంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయారు. గ్రామంలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జిలా వ్యవసాయ శాఖాధికారి వైవి. సుబ్బారావు, ఎడిఎ సత్యనారాయణ, తహశీల్దార్ రవినాయక్, ఎఒ లోకేశ్వరరెడ్డితో పాటు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భద్రతలో పెద్దవడుగూరు ఆదర్శం : ఎస్పీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ ఫక్కీరప్ప

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రజా భద్రతను కాపాడటంలో భాగంగా పెద్దవడుగూరులో దాదాపు 13 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తోందని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి కొనియాడారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.1.30 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 13 సిసి కెమెరాలను మంగళవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా భద్రతలో సిసి కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయన్నారు. ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. అంతేగాకుండా ఇటు ప్రజల భద్రతకు, అటు పోలీసుల విధులకు కెమెరాలు ఎంతో దోహదపడుతామన్నారు. మున్ముందు ఎలాంటి నేరం జరిగినా వాటి ఛేదింపునకు ఎంతో సహకరిస్తామన్నారు. ఇంతకు మునుపే వాణిజ్య సముదాయాలు, దుకాణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. తాడిపత్రి పట్టణంలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసుల ఛేదింపులో సిసి కెమెరాల పాత్ర కీలకంగా నిలిచిందన్నారు. పెద్దవడుగూరు గ్రామాన్ని మిగతా గ్రామాలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి సుంకన్న, ఎంపిపి శ్రీదేవి నాగరాజు, కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, పామిడి రూరల్ సిఐ రామకృష్ణ, పెద్దవడగూరు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

గోరంట్ల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకర్నారాయణ తెలిపారు. మండలంలోని దేవుల చెరువు, పులగుర్లపల్లి, బుడ్డ పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, వైస్ ఎంపీపీ నాగభూషణ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, అగ్రి చైర్మన్ రామకృష్ణారెడ్డి, నాయకులు శంకర్ నాయక్, సుశీల బాయ్, లక్ష్మీ నరసప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూసేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్సీ ఇక్బాల్ అన్నారు. మంగళవారం హిందూపురం రూరల్ మండలం బేవినహళ్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయ కర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, సర్పంచి ఆనంద్, జెడ్పీటీసీ నాగభూషణ, మల్లేష్, వైస్ సర్పంచి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి 'పరిటాల'కు నివాళి

ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : మాజీ మంత్రి పరిటాలరవీంద్ర ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పరిటాలరవీంద్ర 18వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లిమహేశ్ చౌదరి, ఫణికుమార్, కుణుతూరు వేణుగోపాల్ రెడ్డి, ముత్యాలప్పనాయుడు, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాదానాయుడు, నాగూర్ హుస్సేన్, పోతుకుంట లక్ష్మన్న, పరిశే సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 18 వ వర్ధంతి వేడుకలను టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఎస్ వెంకటరమణప్ప, హరినాథ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని టిడిపి స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట నివాసంలో ఆ పార్టీ నాయకులు పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ అత్తార్ చాంద్ బాషా, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 18వ వర్ధంతినిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల రవీంద్ర చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామక్రిష్టప్ప, మునిమడుగు చిన్న వెంకట రాముడు, మాజీ ఎమ్మెల్యే అల్లుడు శశిభూషణ్, కురుబ కృష్ణమూర్తి, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ రవి శంకర్, నాయకులు హుజూర్, రఘువీర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకులు అరెస్టు

మడకశిర : గుడిబండ మండలం కుమ్మర నాగేపల్లిలోనిప్రాథమిక పాఠశాల సమీపంలోని దళితవాడ కాలనీ వద్ద మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. పక్కా సమాచారంతో తమ శాఖ సిబ్బంది మెరుపు దాడి చేసి ఏడుగురు మట్కా నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగానే కుమ్మర నాగేపల్లికి చెందిన రాజ్ కుమార్ నుండి రూ. 1.30 లక్షలు, ఇదే గ్రామానికి చెందిన కల్లి నారాయణప్ప నుండి రూ.9వేలు, ఇరేతూర్పు గ్రామానికి చెందిన తిప్పేస్వామి నుండి రూ. 18వేలు, కుగిరిన పాళ్యం గోవిందరాజుల నుండి రూ. 17,500. అదే కాలనీకి చెందిన రాజు నుండి రూ. 9,500, అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన నరసింహమూర్తి నుండి రూ. 9,700, ఇరేతూర్పి గ్రామానికి చెందిన సిద్ధప్ప నుండి రూ.7.350లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం మీద ఏడుగురు నిర్వాహకుల నుండి ఈ నగదు తో పాటు వారికి ఏడు సెల్ ఫోన్లు, మట్కా పట్టీలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న సిఐ సురేష్ బాబు, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బంది వెంకటేష్, దిలీప్ , లక్ష్మీకాంత్ ,మహమ్మద్ రఫీ ,మంజునాథ్, నవీన్‌ను ఈసందర్భంగా డీఎస్పీ అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు బిసి కాలనీలో ముద్దప్పపల్లికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన గంగాధర్ (46) అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని అతని కుమారుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అత్యాచారయత్నం ఘటనలో కేసు నమోదు

సోమందేపల్లి : మండల కేంద్రానికి చెందిన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి. రామాంజి అనే వక్యకిక్తపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

లేపాక్షి : మండలపరిధిలోని గొంగటిపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... ద్విచక్రవాహనంలో వస్తున్న చిలమత్తూరు మండలం కోర్లకుంట గ్రామానికి చెందిన నాగరాజు, మరో ద్విచక్రవాహనంలో వస్తున్న నేసేపల్లికి చంద్రశేఖర్ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో 108వాహనం ద్వారా ఆసుపత్రి కి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ :రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ శివ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని పెడబల్లి గ్రామంలో బ్యాంకు సేవలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ సౌజన్యంతో అవగాహన కల్పించారు.బీమా పథకాలు, బీమా యోజన, సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వజీర్‌బాషా, శివశంకర్ రెడ్డి, ఓం ప్రకాష్‌తో పాటు ఉపాధి మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ముద్రణ నిషేధం

మడకశిర : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం నుండి ఫ్లెక్సీల ముద్రణ నిషేధిస్తున్నట్లు తహశీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసిందన్నారు. ఈజీవో మంగళవారం నుండి అమల్లోకి వస్తోందన్నారు. ఫ్లెక్సీల వాడకం, ముద్రించడం చేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

హిందూపురం : విద్యార్థులకు వారు వాహనాలను నడిపే సమయంలో రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎంవిఐ రమణ సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో ఎంవిఐ రమణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ శివశంకర్, కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి, అనిల్‌కు